సాక్షి
మెదక్
సోమవారం ǀ 6 ǀ నవంబర్ ǀ 2023



నువ్వా.. నేనా
సెంటిమెంట్ 'ఇలాఖా'గా పేరున్న గజ్వేల్‌లో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలు నువ్వా.. నేనా అన్నట్లుగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. వివరాలు 10లో ▸



కులం పేరుతో వస్తే..
కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. మూసాపేట గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. వివరాలు 10లో ▸



కేసీఆర్ పాలనలో సంక్షేమం
సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు సంక్షేమంగా ఉంటాయని బీఆర్ఎస్ అభ్యర్థులు, నాయకులు కొనియాడారు. ఆదివారం జోరుగా ప్రచారం నిర్వహించారు. వివరాలు 11లో ▸

ఇంటి నుంచే ఓటు

వృద్ధులు, దివ్యాంగులకు సౌలభ్యం
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం
- తప్పనున్న తిప్పలు
- 7వ తేదీ వరకు ఫారమ్–12డీ స్వీకరణ
- జిల్లాలో 13,047 మంది ఓటర్లు



మెదక్: ఈసారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చిన ఈ విధానాన్ని వయోవృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన ఓటర్లు వినియోగించుకోనున్నారు. అలాంటి వారు నామినేషన్ల నోటిఫికేషన్ జారీ అయిన ఐదు రోజుల్లోగా ఫారమ్–12డీ నింపి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. దీంతో వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. ఈ విధానంతో పోలింగ్ బూత్‌ల వద్ద కలిగే ఇబ్బందుల నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఉపశమనం లభించనుంది.

జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. మెదక్‌లో 2,14,118 మంది ఓటర్లు ఉండగా అందులో 3,934 మంది దివ్యాంగులు ఉన్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు 2,448 ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,20,782 మంది ఓటర్లు ఉండగా దివ్యాంగులు 4,948 మంది ఉన్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు 1,717 ఉన్నారు. మొత్తంగా 13,047 మంది ఓటర్లు తమ ఓటును ఇంటి నుంచే వినియోగించుకునే అవకాశం ఉంది. గత ఎన్నికల సమయంలో దివ్యాంగులు, వృద్ధురాలు పోలింగ్ కేంద్ర వద్ద సౌకర్యాలు సరిగా లేక ఇబ్బంది పడేవారు. కేంద్రానికి వెళ్లని లేని పరిస్థితిలో ఓటును వినియోగించుకోలేకపోయారు. వారి ఇబ్బందులు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి వందశాతం పోలింగ్ లక్ష్యంగా తొలిసారిగా ఇంటి నుంచే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఫారమ్–12డీ స్వీకరణ..
సాధారణ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేయాలనుకునే వారికి బూత్‌లెవల్ అధికారులు ఫారమ్–12 డీని అందజేస్తారు. ఫారమ్ నింపి బూత్‌లెవల్ అధికారులకు ఈనెల 7వ తేదీ వరకు అందజేయాలి. వాటిని సదరు అధికారులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఇవ్వనున్నారు. అందులో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఎవరైనా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తామంటే వారికి ఫారమ్ 12డీ అవసరం లేదు. పోలింగ్ కేంద్రానికి వెళ్లొచ్చు.

రహస్యంగానే ఓటు..
ఇంటి వద్ద నుంచే ఓటు వేసే వారికోసం ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఫారమ్–12డీకి దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి బూత్ లెవల్ అధికారులు వెళ్లి బ్యాలెట్ బాక్స్ అందజేస్తారు.అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితోపాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఓటరు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ప్రక్రియనంతా వీడియోగ్రఫీ చేయనున్నారు. ఈ ప్రక్రియను ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



ఈ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసే దివ్యాంగులు, వయోవృద్ధులకు ఫారమ్–12డీ అందజేశాం. అర్హత కల్గిన ఓటర్లు ఫారమ్ నింపి బూత్ లెవల్ అధికారులకు అందిస్తారు. ఇందులో అర్హులైన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చేవారి కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. ర్యాంప్‌లు, వీల్ చైర్‌లు, టెంట్‌లు ఏర్పాటు చేయిస్తున్నాం.
– అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో

ప్రతీ అభ్యర్థి ఖర్చు వివరాలు నమోదు చేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్


మెదక్ కలెక్టరేట్ : ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు నామినేషన్ వేసినప్పటి నుంచి లెక్కలోకి తీసుకోవాలని, ప్రతీ అభ్యర్థి బ్యాంక్ కొత్త ఖాతా తెరవాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మెదక్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెంచాలని, ప్రతీ అభ్యర్థి వ్యయ వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే ఏఈఓ అకౌంటింగ్ బృందాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో టీవీ మానిటరింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లైజన్ అ ధికారి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కృష్ణమూర్తి, రిటర్నింగ్ అధికారి,ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, అకౌంటింగ్ టీం, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ
జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండి ప్రతీ వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ సూచించారు. ఆదివారం హవేళిఘణాపూర్ మండలం, బూర్గుపల్లి, జిల్లా బోర్డర్ పోచమ్మరాల్ చెక్ పోస్టును పరిశీలించారు.

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చులపై పటిష్టమైన నిఘా పెట్టినట్లు ఎన్నికల పరిశీలకుడు సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేటలో ఎన్నికల టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ర్యాలీలు, వాహనాలను బృందం సభ్యులు ఎప్పటికప్పుడూ కెమెరాలతో రికార్డు చేయాలన్నారు. అలాగే, బృందం సభ్యులు తిరుమలేశ్‌కు సలహాలు, సూచనలు చేశారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని జిల్లా సరిహద్దులో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆదివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ పరిశీలించారు. చెక్ పోస్టుల పని తీరును, రికార్డులను పరిశీలించి, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. 24 గంటల పాటు సీసీ కెమెరాలు నిరంతరాయంగా పనిచేయాలన్నారు. ఆయన వెంట లైజన్ అధికారి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణమూర్తి, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

న్యూస్‌రీల్

హోం మంత్రి మహమూద్ అలీ వాహనం తనిఖీ


హోం మంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): హోం మంత్రి మహమూద్ అలీ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో ప్రచారానికి వెళ్తున్న హోం మంత్రి మహమూద్ అలీ, ఎంపీ బీబీ పాటిల్ వాహనాలను ఆదివారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని చెక్ పోస్ట్ వద్ద పోలీసులు చెక్ చేసి చేశారు.

కష్టాలు తీరాలంటే గెలిపించండి
కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు


మాట్లాడుతున్న రోహిత్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్టీ మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు కోరారు. ఆదివారం చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ సర్కార్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, గంగా నరేందర్, రంగారావు, యాదవరావు, భిక్షపతి, అంబాదాస్, సిద్దిరాములు పాల్గొన్నారు.

బీఎస్పీ నర్సాపూర్ అభ్యర్థిగా నర్సింహులు


బీ ఫామ్ అందుకుంటున్న నర్సింహులు

నర్సాపూర్: బీఎస్పీ నర్సాపూర్ అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కుతాడి నర్సింహులును పార్టీ అధిష్టానం ఆదివారం ప్రకటించింది. దీంతో పార్టీ ఉపాధ్యక్షుడు దయానంద్, ప్రచార కమిటీ చైర్మన్ విజయ్ ఆర్యా బీఫామ్ సైతం అందజేశారు. నర్సింహులు కొడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లి గ్రామంలో జన్మించారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఎల్ఈఈ చదివారు. ఎయిర్ ఇండియాలో సర్వీస్ మేనేజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. 2022లో బీఎస్పీలో చేరి నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పని చేశారు. 2023 నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

బగలాముఖీ ఆలయంలో డీఎస్పీ పూజలు

శివ్వంపేట(నర్సాపూర్) : మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ అమ్మవారిని ఆదివారం తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా శివ్వంపేట బగలాముఖీ శక్తిపీఠం నిర్మించడం గొప్ప విషయమన్నారు.

రాజకీయ కూలీలు!
- ప్రచారానికి రోజుకు రూ.300 నుంచి రూ.500
- బతుకమ్మ, బోనమెత్తితే అదనపు భత్యం

మెదక్: ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. అభ్యర్థి గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్లినప్పుడు ఓటర్లు కనిపించాలంటూ కూలి ఇచ్చి మరీ ప్రచారానికి తీసుకెళ్తున్నట్లు తెలిసింది. ఓటర్లే రాజకీయ కూలీలుగా అవతారం ఎత్తడంతో పల్లెలన్నీ ప్రచారాలతో మారు మోగిపోతున్నాయి. ఒక్కో మహిళకు రోజుకు రూ. 300 నుంచి రూ.500 వరకు కూలి ఇస్తున్నట్లు సమాచారం. మగవారికి రోజుకు రూ.500 కూలితో పాటు మందు ఇస్తున్నట్లు పలువురు కార్యకర్తలు చెబుతున్నారు. అంతే కాకుండా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం చికెన్, మటన్‌లతో భోజనం పెడుతున్నారు. బతుకమ్మలతోపాటు బోనం ఎత్తిన మహిళా కూలీలకు అదనంగా డబ్బు ఇస్తున్నట్లు తెలిసింది. ఈ రాజకీయ కూలీలు ఏ పార్టీకైనా ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

రోహిత్‌కు ఎద్దు ఎవుసం తెలియదు

బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి


పద్మకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామీణ ప్రాంతంలోని ఎద్దు, ఎవుసం, చెరువు, చేను తెలియని కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని తొగుట, ముత్తాయికోట, మద్దుల్‌వాయి, కూచన్‌పల్లి, ముత్తాయిపల్లి, ఫరీద్‌పూర్, రాజ్‌పేట, కొత్తపల్లి, వాడి గ్రామాల్లో పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు డప్పుచప్పుళ్లు, మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలయ్యాయని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోతే గోసపడాల్సి వస్తుందన్నారు. నియోజకవర్గంలో మైనంపల్లి హన్మంతరావు ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అది సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నరేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సతీశ్‌రావు, మేకల సాయిలు, బ్రహ్మం, గోపాల్, అంజాగౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హామీలను నమ్మొద్దు

కాంగ్రెస్ నర్సాపూర్ అభ్యర్థి రాజిరెడ్డి


ఆరు గ్యారంటీలను వివరిస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): బీఆర్ఎస్ హామీలు నమ్మి మోసపోవద్దని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్నా.. ఇచ్చిన హామీలు అమలు చేయని కేసీఆర్.. కొత్త హామీలతో ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని, పేదల కోసం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాల అమలు పక్కాగా జరుగుతాయని అన్నారు. ప్రజలంతా ఈ ఎన్నికల్లో తనకు అండగా ఉండి గెలిపించాలన్నారు. ప్రచారంలో సుహాసిని రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, మల్లేశం, కిష్టగౌడ్, నర్సింలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూశారు

- లంబాడీలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ
- తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన అభ్యర్థి సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్ : గిరిజనులను కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓటు బ్యాంకుగానే చూశారు తప్ప, వారి సమస్యల పరిష్కారానికి ఏనాడు కృషి చేయలేదని, సంక్షేమ పథకాలు అమలు చేయలేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులు, లంబాడీల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సమావేశానికి సత్యవతి రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లంబాడీలను కాంగ్రెస్, బీజేపీలు ఏనాడు పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేశారని అన్నారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దారన్నారు. గతంలో వార్డు సభ్యులుగా ఉండే గిరిజనులు సర్పంచ్‌లుగా ఎదిగేందుకు కృషి చేశారని అన్నారు. నియోజకవర్గంలోని తండాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారని, తండాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్లు వేసేందుకు నిధులు వచ్చాయని, టెండర్లు పూర్తి కాగానే రోడ్లు వేస్తారని సత్యవతి వివరించారు. కాగా, దివంగత సీఎం ఎన్టీఆర్ గిరిజనులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, సీఎం కేసీఆర్ వాటిని పది శాతానికి పెంచి అన్ని రంగాల్లో ఎదిగేందుకు తోడ్పడ్డారని కొనియాడారు. నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న సునీతారెడ్డిని గెలిపించాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. సునీతారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ, సీఎం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే వరకు తన కాళ్లకు చెప్పులు ధరించకుండా తిరుగుతున్న మంత్రి సత్యవతి రాథోడ్ గొప్ప నాయకురాలని కొనియాడారు. సమావేశంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కొడిపల్లి ఎంపీపీ, జెడ్పీటీసీలు బబియానాయక్, కవిత, రాజునాయక్‌లతో పాటు గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంధ్యారాణి, లలిత, రాజేందర్, రమేశ్ నాయక్, అమర్ సింగ్, రవినాయక్, ఉమ్లా, సామ్యా, నర్సింగ్ నాయక్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డితో పాటు గిరిజన నాయకులు మంత్రిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కరాటేలో బంగారు పతకాలు


పతకాలతో బాలికలు

మెదక్ మున్సిపాలిటీ: జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ నగేశ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్ జరుగగా, మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన మెహరీన్, ప్రీతి పాల్గొని కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. వీరు మాస్టర్ శ్రీనిధి వద్ద కరాటే శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ గాజుల మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

రాజీనామాలు

బీజేపీ నుంచి మాజీ జెడ్పీటీసీ..


మాట్లాడుతున్న సురేందర్‌నాయక్, రేణుకానాయక్


చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పేట మాజీ జెడ్పీటీసీ సురేందర్‌నాయక్, జంగరాయి మాజీ ఎంపీటీసీ రేణుకానాయక్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీలో సరైన గుర్తింపులేదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సైతం ఇప్పటి వరకు ముఖ్య కార్యకర్తలను కలుపుపోలేకపోయారన్నారు. తమను గుర్తించని పార్టీలో ఉండలేక రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు..



కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ పార్టీకి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్ నియోవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ గిరిజన నాయకులపై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఇప్పుడు నిజమైన నాయకులు లేరన్నారు. ఆత్మగౌరవం చంపుకొని పార్టీలో ఉండలేక వీడుతున్నట్లు పేర్కొన్నారు.




ప్రార్థనలో విద్యార్థులు,
(ఇన్‌సెట్) దైవసందేశమిస్తున్న శాంతయ్య

సండే స్కూల్ ఉత్సవం

మెదక్: ప్రపంచప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సండే స్కూల్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్యతోపాటు పలువురు మత పెద్దలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు శాంతక్లాస్ వేషధారణలతో భక్తిగీతాలు ఆలపించారు. అంతకు ముందు ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య విద్యార్థులనుద్దేశించి దైవసందేశమిచ్చి ఆశీర్వదించారు.




ఆలయం ఎదుట భక్తుల సందడి,
(ఇన్‌సెట్) పూజ చేస్తున్న అర్చకులు

ఏడుపాయల జనసంద్రం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయం ఆదివారం భక్తులతో జనసంద్రంగా మారింది. వేలాది భక్తులు దుర్గమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు శంకర శర్మ, పార్థీవశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పాలకవర్గం చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, పోలీసులు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

చెల్లీ.. నీ ఓటు మా ఆయనకే..



బీడీలు చుడుతున్న కొమ్మూరి అరుణ

స్థానికుడైన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డినే ఈ సారి జనగామ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన సతీమణి అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని బైరాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఆరు గ్యారంటీ కార్డుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. ప్రచారంలో భాగంగా అరుణ బీడీలు చుట్టి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కామెడీ జీవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాములు, దాసరి మనోజ్, మ్యాక మల్లేశం పాల్గొన్నారు.

–మద్దూరు(హుస్నాబాద్)

జెండా పట్టు.. బీఆర్‌ఎస్‌కు జై కొట్టు



జెండాలతో నృత్యం చేస్తున్న చిన్నారులు

మండలంలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో ఆదివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఈ రెండు గ్రామాల చిన్నారులు కూడా ప్రచారంలో భాగమయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు, జెండాలు చేతబూని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేశారు. తమ తల్లిదండ్రుల్లాగే తాము కూడా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని చిన్నారులు చెప్పారు.

–నర్సాపూర్ రూరల్

వరి పొలాల్లో.. ప్రచార మోత



బ్రహ్మణపల్లిలో ఓటు వేయాలని రైతులను కోరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బ్రహ్మణపల్లిలో వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించి, కేసీఆర్‌కు ఓటు వేయాలని కోరారు.

–తూప్రాన్

ఓటు కోసం.. కోటి విన్యాసాలు



యువకుడికి గడ్డం గీస్తున్న ఎంపీపీ బాలేశం గౌడ్

ఓటు కోసం నాయకులు కోటి విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ జోరుగా ప్రచారం నిర్వహిస్తుంది. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ బాలేషం గౌడ్ స్థానికంగా ఉన్న ఓ కటింగ్ షాపులో యువకుడికి గడ్డం గీస్తూ కారు గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

–జగదేవ్‌పూర్ (గజ్వేల్)

క్లుప్తంగా

నగదు పట్టివేత

జహీరాబాద్: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.19.90 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. సునీల్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు కారులో డబ్బు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



కూరగాయలు విక్రయిస్తున్న రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–19 నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్, తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్లు నిలవగా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మెదక్, తృతీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు.

నువ్వా.. నేనా!



- సెంటిమెంట్ ఇలాఖా గజ్వేల్‌లో ప్రచార హోరు
- అభివృద్ధి, సంక్షేమంతో బీఆర్‌ఎస్ ముందుకు..
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే ఎజెండాగా బీజేపీ, కాంగ్రెస్
- రోడ్‌షోలు, సభలు, సమావేశాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం


సెంటిమెంట్ 'ఇలాఖా'గా పేరున్న గజ్వేల్‌లో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. వాడవాడలా తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

- గజ్వేల్

రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే గజ్వేల్ ఎన్నో విశేషాలకు నెలవు. ప్రత్యేకించి 1952లో జరిగిన ఎన్నికల్లో మిగితా 15సార్లు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిచినా రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం అనవాయితీగా వస్తుంది. ఇదే 'సెంటిమెంట్'ను నమ్ముకొని సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రమంతటా తిరిగే అవసరమున్నా దృష్ట్యా ఆయన ప్రచార బాధ్యతలను పార్టీ యంత్రాంగమే చేపడుతోంది. ఇందుకోసం ఎన్నికల ఇన్‌చార్జులుగా మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలు వ్యవహరిస్తుండగా...సమన్వయ కమిటీ సభ్యులుగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. కేసీఆర్ ప్రాతినిధ్యం ఫలితంగా పదేళ్లలో నియోజకవర్గంలో వచ్చిన మార్పును ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యేకించి ఇక్కడ వేలాది కోట్ల వ్యయంతో నిర్మించిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాలతో పాటు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రింగురోడ్డు, ఎడ్యుకేషన్ హబ్‌వంటి భారీ అభివృద్ధి ప్రాజెక్ట్‌లే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలను వివరిస్తున్నారు. అదేవిధంగా కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల మార్పును సైతం ఓటర్లకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. రోడ్‌షోలు, నృత్యాలతో ఆ పార్టీ నేతలు ఆకట్టుకుంటున్నారు. ప్రత్యేకించి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రచారానికి వెళ్లిన ప్రతీచోట 'గులాబీ జెండాలే రామక్క' పాటపై మహిళలతో కలిసి నృత్యం చేస్తూ ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

బీజేపీ సైతం గట్టిగానే కదన రంగంలోకి దిగింది. ఈ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారం వేగం పెంచారు. ప్రత్యేకించి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇతర ప్యాకేజీల పంపిణీలో నెలకొన్న జాప్యాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా నియోజకర్గంలో అభివృద్ధి పేరిట విధ్వంసం జరిగిందని చెబుతూ...పేదలకు చెందిన వేలాది ఎకరాల భూములను లాక్కొని రోడ్డున పడేశారని ప్రచారం చేస్తున్నారు. ఈ కష్టాల నుంచి బయట పడాలంటే బీజేపీ గెలిపించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ సైతం సత్తా చాటేందుకు ప్రయత్నిస్తుంది. ఈ పార్టీ తూంకుంట నర్సారెడ్డి తానూ 2009లో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ప్రజలందరికీ 24గంటలు అందుబాటులో ఉన్నానని, కానీ కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు కనీసం దర్శనం ఇచ్చే పరిస్థితి లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. మరోసారి బీఆర్‌ఎస్ గెలిస్తే కేసీఆర్ నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోదని, స్థానికుల సమస్యల పరిష్కారానికి కలవడానికి ప్రయత్నించినా అది జరగదని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందనే విషయాన్ని కూడా కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. మొత్తానికి గజ్వేల్‌లో ప్రచార పర్వం ఆసక్తికరంగా మారింది. నామినేషన్లు ముగిసిన తర్వాత ప్రచారం తీరు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దు



ప్రచారంలో పాల్గొన్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు సేనాధిపతి, లావణ్య రవి, జీవన్ రెడ్డి, శ్రీధర్ గుప్తా, శేఖర్, జితేందర్ రెడ్డి, బిక్షపతి, రఘువీర్, బలరాం రెడ్డి, అన్నము రవి, మేఘమాల పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట, పెద్దచింతకుంట గ్రామాల్లో ఆదివారం రాత్రి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, సర్పంచ్ లు సురేష్ గౌడ్, శివకుమార్, మురళి గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియమ్మ రుణం తీర్చుకుందాం



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట మదిర సయ్యద్ నగర్ మైనారిటీ నాయకులు ఆదివారం హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి సోనియమ్మ రుణం తీర్చుకుందామని కోరారు. దుబ్బాకలో మాజీ మంత్రి దివంగత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. తనను దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్వామి, నరేందర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, రవీందర్, నిరంజన్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం



బీజేపీలో చేరుతున్న నాయకులు

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కొండపాక(గజ్వేల్): కుటుంబ పాలనకు చరమ గీతం పాడుదామని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లకుడారం, ఎర్రవల్లి, బొబ్బాయిపల్లి, కొండపాక, తిప్పారం, బందారం, సింగారం, చిన్న కిష్టాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన 250 మంది యువత బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పేరిట వేల కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. తనను గెలిపిస్తే గజ్వేల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మన్నెం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగపూర్, ఇరిగిపల్లి, కలబ్ గూర్, కులాబ్ గూర్, తాళ్లపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణి, సునీత, కసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

మాయమాటలు నమ్మి గోస పడొద్దు

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీల మాటలను నమ్మి గోస పడొద్దని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో సర్పంచ్ మల్లమారి రవీందర్, గ్రామాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్, డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా తిరుగుతున్నారన్నారు. అధికారం కోసం వస్తున్న ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించాలన్నారు. కుల మతాలకతీతంగా పథకాలు అందిస్తున్న కేసీఆర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, చిట్టి మాధురిరెడ్డి, అనంతుల పద్మ, ప్రశాంత్, నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, రాధాకిషన్‌రెడ్డి, బొడ్డుల కనకయ్య, దోమల ఎల్లం పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

కొండపాక(గజ్వేల్): యువత తలుచుకుంటే సాధించనిది లేదని డీసీసీబీ చైర్మన్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, బందారం గ్రామాలకు చెందిన 150 మంది యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్శితులై యువత బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రాణాలకు తెగించి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో నూనె కుమార్, మల్లమారి రవీందర్, ర్యాగల్ల దుర్గయ్య, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సున్నం భాస్కర్ పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా..

దుబ్బాక: మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరందుకుంది. ధర్మాజీపేటలో ఆదివారం కౌన్సిలర్లు కనకయ్య, స్వామి, బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార పాటలకు కౌన్సిలర్లు, నాయకులు స్టెప్పులు వేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాజమౌళి, భూంరెడ్డి, బాలకృషన్ గౌడ్, వంశీ కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.



ప్రచార పాటలకు నృత్యం చేస్తున్న కౌన్సిలర్లు

అవినీతికి కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్



రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

దుబ్బాకటౌన్ : అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన దగాకోరు కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట, మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన ఏపాటిదో మేడిగడ్డ ప్రాజెక్టును చూస్తే తేటతెల్లం అవుతుందన్నారు. అనవసర ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం మండలంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు.

తొగుట(దుబ్బాక): దుబ్బాకలో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాంపురం గ్రామస్తులు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన యువత మార్పు కోరుకుంటుందన్నారు. ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ జంటను కాపాడిన పోలీసులు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడబోతుండగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రక్షించిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. గోవిందాపూర్‌కు చెందిన స్వామి, మెదక్ జిల్లా రామాయంపేట మండలం బచ్చురాజ్‌పల్లికి చెందిన రేణుక యేడాది కాలంగా ప్రేమించుకున్నారు. ఇటీవలే కులాంతర వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్ ద్వారా స్నేహితులకు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఫోన్‌ను ట్రేస్ చేసి లొకేషన్‌ను తెలుసుకున్నారు. ఎస్‌ఐ చైతన్య కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ప్రేమ జంటను కాపాడారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఆత్మహత్య చేసుకోబోయిన ప్రేమ జంటను కాపాడిన ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి